సాక్షి వరంగల్

మంగళవారం | 24 | డిసెంబర్ | 2024



ఓరుగల్లుకు ఒరిగిందేమీ లేదు..
సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో ఓరుగల్లుకు ఒరిగిందేమీ లేదని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు.
- 8లో ▸



పలు రైళ్ల రద్దు
వరంగల్–విజయవాడ మధ్య మోటమర్రి సెక్షన్‌లో మూడో రైల్వే లైన్, ఇంజనీరింగ్ బ్లాక్‌తో పలు రైళ్లను రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు.
- 8లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం $29^0/18^0$
జిల్లాలో ఉదయం పొగమంచు కురుస్తుంది. మధ్యాహ్నం ఎండగా ఉంటుంది. రాత్రి చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఆరోగ్య సేవలు అందుతున్నాయా?

- గ్రామాల్లో పర్యటించిన మాతాశిశు సంరక్షణశాఖ రాష్ట్ర బృందం



దుగ్గొండి: గర్భిణీగా నమోదు చేసుకుని శిశువు ఏడాదిన్నర వయసు వచ్చే వరకు ప్రభుత్వ ఆరోగ్య సిబ్బంది వైద్య సేవలు ఎలా ఉన్నాయి.. పోషకాహారం అందిస్తున్నారా? లేదా? అని మాతా శిశు సంరక్షణ రాష్ట్ర అధికారుల బృందం ఓ బాలింతను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సోమవారం మండలంలోని కేశవాపురం పీహెచ్‌సీని ఎంహెచ్‌ఎన్ అధికారులు సందర్శించారు. ఆస్పత్రిలో గ్రామాల వారీగా గర్భిణులు, బాలింతల నమోదు వివరాలను పరిశీలించారు. వైద్యం అందించిన విధానాన్ని తనిఖీ చేశారు. అనంతరం గ్రామంలోని ఓ బాలింత ఇంటికి వెళ్లి ఆమెతో మాట్లాడారు. ఎంహెచ్‌ఎన్ కార్డును పరిశీలించి వైద్యం అందించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో యూనిసెఫ్ ప్రతినిధి డాక్టర్ సౌజన్య, డాక్టర్ పద్మశ్రీ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ప్రకాష్, వైద్యాధికారి విజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడల నిర్వహణకు ఎన్‌ఆర్‌ఐ ఆర్థికసాయం



గీసుకొండ: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో జనవరి 8 నుంచి 11వ తేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి సీనియర్స్ ఖోఖో పోటీల నిర్వహణకు అదే గ్రామానికి చెందిన డాక్టర్ పసునూటి కల్యాణ్, స్వాతి అనే ఎన్ఆర్ఐ దంపతులు రూ. 50 వేలు సాయం చేశారు. సోమవారం ఎన్ఆర్ఐ పంపించిన చెక్కును స్టేట్ బ్యాంకు రిటైర్డ్ మేనేజర్ పెగళ్లపాటి లక్ష్మీనారాయణ టోర్నీ ఆర్గనైజింగ్ సెక్రటరీ కోట రాంబాబుకు అందించారు. పేదలను ఆదుకుంటున్న లక్ష్మీనారాయణను తాము స్ఫూర్తిగా తీసుకుని సాయం అందించినట్లు ఎన్ఆర్ఐ దంపతులు పేర్కొన్నారు. లక్ష్మీనర్సింహస్వామి ఆలయ కమిటీ చైర్మన్ ఏనుగుల సాంబరెడ్డి, గ్రామపెద్దలు రామా కుమారస్వామి, కర్ణకంటి రాంమూర్తి, వీరగోని అనిల్, గోనెల సదానందం, నూర కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

రావులతండాలో రైతు దినోత్సవం



రాయపర్తి: జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా మహిళా రైతులు, సీనియర్ రైతు మిత్రుల ఆధ్వర్యంలో ఆర్గానిక్ ఫార్మర్, ప్రముఖ పర్యావరణ ఉద్యమకారుడు రావుల భాస్కర్‌రావు సమక్షంలో సోమవారం మండలంలోని రావులతండాలో రైతు దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా భాస్కర్‌రావు మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యధిక రైతులు ఉన్నటువంటి వ్యవసాయ ఆధారిత దేశంగా గుర్తింపు పొందిందన్నారు. అన్ని వ్యాపారాలు వ్యవసాయ ఉత్పత్తులపైనే ఆధారపడి ఉంటాయన్నారు. అన్ని పంటలకు బోనస్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. అంతకుముందు కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా రైతులు రామంజి బుచ్చమ్మ, యాదలక్ష్మి, స్వామి, మల్లేష్, యాకమ్మ, నేతావత్ భీమ్లా, చెవ్వ స్వామి, రైతులు పాల్గొన్నారు.

డోంట్ కేర్!



ఇక్కడ తప్పు చేసినా క్షమిస్తారు..
- జిల్లా సంక్షేమ విభాగంలో అధికారుల వింత పోకడ
- దత్తత విషయంలో నిబంధనలు పాటించకున్నా ఓకే..
- ఉన్నతాధికారుల విచారణలో తప్పని తేలినా సైలెంట్
- వీహబ్ నియామకాల్లో అక్రమాలు జరిగినా చర్యలు శూన్యం
- ఇప్పటికే 'సాక్షి' వెలుగులోకి తెచ్చినా కదలిక లేని వైనం

సాక్షి, వరంగల్: జిల్లా సంక్షేమ విభాగం అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ఇక్కడ ఏం చేసిన 'డోంట్ కేర్' అంటూ అధికారులు పద్ధతి మార్చుకోవడం లేదు. వివరాలిలా ఉన్నాయి... గతంలో జరిగిన వీహబ్ నియామకాల్లో అక్రమ పద్ధతిలో కొందరికి ఉద్యోగాలివ్వడం, అక్రమ పద్ధతిలో శిశువుల దత్తత విషయంలో అధికారులు నిబంధనలు పట్టించుకోకుండా దత్తత కోరుకునే తల్లిదండ్రులను ఇబ్బందులు పెడుతున్నారని.. బాధితుల వాయిస్‌తో 'సాక్షి' ప్రత్యేక కథనాలు ప్రచురించడంతో ఉన్నతాధికారులు విచారణ చేశారు. ఈ రెండు అంశాల్లోనూ అప్పుడు నియామకాలు చేసిన అధికారుల ఉదాసీనతతో అర్హులకు అందలం ఎక్కించారని తేలినా, దత్తత అధికారి శిశువుల దత్తత విషయంలో నిబంధనలు పాటించకుండా తనకు ఇష్టం వచ్చిన రీతిలో వ్యవహరించారని విచారణలో రుజువైనా.. ఇప్పటి వరకు చర్యలు తీసుకోకుండా ఉన్నతాధికారులు మీనమేషాలు లెక్కించడంలో అంతర్యమేమిటనే చర్చ జోరుగా సాగుతోంది. ఈ విభాగంలో తప్పు చేసినా.. అధికారులు క్షమించేస్తారన్న టాక్ ఉంది. పలువురి అధికారుల తీరుతో అర్హులకు అన్యాయం జరిగినా చర్యలు తీసుకోకపోవడంతో మిగతా విభాగాలకు కూడా తప్పుడు సంకేతాలు వెళ్తున్నాయన్న చర్చ కలెక్టరేట్ వర్గాల్లో జోరుగా సాగుతోంది.

అసలు ఏం జరిగిందంటే..

- రాయపర్తి మండలానికి చెందిన మురుపోజు రాంబాబు, సవిత దంపతులు 2019 ఫిబ్రవరి 9న ఆడపిల్ల కావాలని కారా (సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ) వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేయడంతో గృహ సందర్శన నివేదికను అధికారులు సిద్ధం చేసి అప్‌లోడ్ చేశారు. మూడేళ్ల కాల పరిమితి దాటడంతో 2022 డిసెంబర్ 6న గృహ సందర్శన నివేదికను తిరిగి నిర్వహించాలని తమ లాగిన్ ద్వారా రీవాలిడేషన్‌కు రిక్వెస్ట్ పంపారు. 60 రోజుల్లో హోం స్టడీ చేయాల్సి ఉన్నా.. రెండేళ్లైనా సదరు అధికారి గృహ సందర్శన నివేదిక(హెచ్ఎస్ఆర్) సిద్ధం చేయలేదు. దీంతో తాము సీనియార్టీని కోల్పోవాల్సిన పరిస్థితి వచ్చిందని రాంబాబు దంపతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆమె ఆదేశాల మేరకు విచారించిన బృందం కూడా దత్తత నిబంధనల ప్రకారం కౌన్సెలింగ్ ఇవ్వలేదు. రెండేళ్లకు పైగా హెచ్ఎస్ఆర్ సిద్ధం చేయలేదు. దత్తత తల్లిదండ్రులకు నోటీసులు, లిఖితపూర్వకంగా ఎటువంటి సమాచారం ఇవ్వలేదని విచారణలో తేలడంతో ఈ ఏడాది జూన్‌లో సదరు నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించారు. ఈ నివేదిక ఇచ్చి ఆరునెలలు కావస్తున్నా.. ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోవడంతో ఏమి చేసినా చెల్లుతుందనే ధోరణి ఆ విభాగంలో కనిపిస్తోంది.
- వర్ధన్నపేట మండలం దమ్మన్నపేట గ్రామానికి చెందిన బొమ్మిడి నర్సయ్య దంపతులు 2020 జూలై 31న పిల్లలు కావాలంటూ 'కారా' వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకున్నారు. అప్పుడు అధికారులు ఇంటికి వెళ్లి అధ్యయనం చేసి నివేదికను సమర్పించారు. మూడేళ్లు దాటాక రీవాలిడేషన్ చేయాలి. అయితే హనుమకొండ బాలల పరిరక్షణ విభాగానికి చెందిన ఓ అధికారికి డీడీ తీయాలంటే రూ.ఆరు వేలను ఇచ్చారు. డీడీకి రూ.రెండు వేలు ఖర్చవుతాయని, మిగిలినవి ఖర్చులకు కావాలని తీసుకున్నారు. ఆ తర్వాత మాకు వయస్సు అయిపోయిందంటూ పిల్లలు దత్తత రారని అడాప్షన్ అధికారి మెయిల్ చేయడంతో అప్పటి కలెక్టర్ ప్రావీణ్యకు లిఖితపూర్వకంగా ఫిర్యాదుచేశారు. శిశువును దత్తత ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో విచారణ జరిగినా హనుమకొండ బాలల సంరక్షణ విభాగంలోని అధికారి తన తప్పు తేలిందనే ఉద్దేశంతో ఆ ఉద్యోగానికి రాజీనామా చేసి వెళ్లిపోయినట్టుగా తెలిసింది. వరంగల్ జిల్లాలో మాత్రం చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

వీహబ్ నియామకాల్లోనూ అక్రమాలే..
కొత్త మిషన్ శక్తి పథకం కింద డిస్ట్రిక్ట్ హబ్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్‌కు సంబంధించి నాలుగు కాంట్రాక్ట్ బేస్ ఉద్యోగాలు గతేడాది జూలైలో నియామకాలు చేశారు. వీటిలో మూడింటిల్లో అంగన్‌వాడీ టీచర్ కోడలు, జిల్లా సంక్షేమ విభాగంలో పనిచేసే అకౌంటెంట్ భార్యకు మార్కులు తక్కువగా ఉన్నా, ఇంటర్వ్యూలో అధిక మార్కులిచ్చారు. వీరు సమర్పించిన అనుభవ పత్రాలు కూడా సరైనవి కావనే ఆరోపణలున్నాయి. తాజాగా ఇందులో ఒకరు నకిలీ పీజీ పత్రాలు ఇచ్చారని పోలీసు విచారణలో తేలడంతో ఆమె తెలివిగా రాజీనామా చేసి వెళ్లినట్టు తెలిసింది. అలాగే మరో పోస్టుకు సంబంధించి విద్యార్హత లేకున్నా ఆమెకు ఉద్యోగం కట్టబెట్టారని ప్రచారం ఉంది. వీటిపై కలెక్టర్ సత్య శారద లోతుగా దర్యాప్తు జరిపి అనర్హులను పక్కనబెడితే అర్హులకు న్యాయం జరుగుతుంది. తప్పుడు పత్రాలు పెట్టి ఉద్యోగం పొందిన వారితో పాటు అవి క్షుణ్ణంగా పరిశీలించాల్సిన అధికారుల నిర్లక్ష్యంపై విచారణ జరిపి క్రిమినల్ చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ ఉంది.



జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయం

క్రీస్తు బోధనలు మానవాళికి మార్గదర్శకం



పాస్టర్‌కు దుస్తులు అందజేస్తున్న మంత్రి కొండా సురేఖ, మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ సత్యశారద

- మంత్రి కొండా సురేఖ
- పాస్టర్లకు దుస్తులు పంపిణీ

వరంగల్: ఏసుక్రీస్తు బోధనలు సర్వమానవాళికి మార్గదర్శకమని మంత్రి కొండా సురేఖ అన్నారు. సోమవారం జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వరంగల్ ఓసిటీలోని తూర్పు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలకు మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ సత్యశారదతో కలిసి మంత్రి కేక్ కట్ చేసి పాస్టర్లకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ క్రిస్టియన్ మైనార్టీల అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. సర్వమతాలకు రక్షణ కల్పించడమే తెలంగాణ ప్రభుత్వం ముఖ్య ఉద్దేశమన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అధికారికంగా క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్నామని, గతంలో ఎన్నడూ లేని విధంగా చర్చిల నిర్మాణాలకు, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. అంతకు ముందు లేబర్‌కాలనీ సీబీసీ చర్చి అభివృద్ధికి రూ.కోటి నిధుల జీఓను పాస్టర్లకు అందించారు. అనంతరం మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ అన్ని మతాల సారాంశం మానవసేవయే మాధవసేవ అని అన్నారు. కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ వినయం, కరుణను ఆచరణాత్మకంగా చూపిన వ్యక్తి ఏసుక్రీస్తు అని కొనియాడారు. అనంతరం ఏర్పాటు చేసిన విందులో క్రైస్తవులకు మంత్రి స్వయంగా వడ్డించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు గుండు చందన, పల్లం పద్మ, బోగి సువర్ణ, బైరబోయిన ఉమ, సురేష్‌జోషి, చింతాకుల అనిల్‌కుమార్, పోశాల పద్మ, కావేటి కవిత, మరుపల్ల రవి, బాల్నే సురేష్, సోమిశెట్టి ప్రవీణ్‌కుమార్, ఫుర్ఖాన్, జిల్లా మైనార్టీ, బీసీ సంక్షేమ అధికారులు పుష్పలత, రమేష్ తహసీల్దార్లు ఇక్బాల్, నాగేశ్వరరావు, పాస్టర్లు, జగ్జీవన్ బాబ్జి, పీఆర్.సాల్మన్, దీనదయాళ్, ప్రేమ అరుణ్, క్రైస్తవులు పాల్గొన్నారు. అలాగే హనుమకొండలోని ఆర్అండ్‌బీ అతిథిగృహంలో కలెక్టర్లు సత్యశారద, ప్రావీణ్య, బల్దియా కమిషనర్ అశ్వినితానాజీ వాకడేలతో కలిసి వరంగల్ తూర్పు నియోజకవర్గ అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. సమావేశంలో డీఎఫ్‌ఓలు అనూజ్ అగర్వాల్, లావణ్య, బల్దియా ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, కుడా పీఓ అజిత్‌రెడ్డి, ఈఈలు శ్రీనివాస్, భీంరావు, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సునీత, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

కేయూ క్యాంపస్: యువత మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్స్ అవేర్‌నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి చదువుపై దృష్టి సారించాలన్నారు. వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా మాట్లాడుతూ.. యువత మాదకద్రవ్యాలను, మత్తుపదార్థాలను విక్రయించినా, వినియోగించినా కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో యాంటీ నార్కొటిక్ డీఎస్పీ సైదులు, కేయూ పాలక మండలి సభ్యులు డాక్టర్ కె.అనితారెడ్డి, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి, జగదీశ్‌బాబు, నారాయణ పాల్గొన్నారు.

దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలి

- కలెక్టర్ డాక్టర్ సత్యశారద
- ప్రజావాణిలో 163 అర్జీలు



బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

వరంగల్: ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ సత్యశారదతో పాటు అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి, డీఆర్‌ఓ విజయలక్ష్మి, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, ఆర్డీఓలు సత్యపాల్ రెడ్డి, ఉమారాణిలు పాల్గొని ప్రజల ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ భూ సంబంధిత సమస్యలు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, వ్యవసాయం, మార్కెటింగ్, బ్యాంక్ సమస్యలపై దరఖాస్తులు వచ్చాయన్నారు. సంబంధిత అధికారులు ఆయా సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. గ్రీవెన్స్‌లో మొత్తం 163 దరఖాస్తులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ సూపరింటెండెంట్ శ్రీకాంత్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అనురాధ, డీసీఓ నీరజ, డీపీఓ కల్పన, డీఎం రాజు, జిల్లా ఉపాధి శాఖ అధికారి ఉమారాణి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ నిర్వహణకు పటిష్ట చర్యలు



మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

వరంగల్: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులో పంట ఉత్పత్తుల కొనుగోళ్ల నిర్వహణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మార్కెటింగ్, వ్యవసాయ, హార్టికల్చర్ శాఖల అధికారులు, వ్యాపారులు, కార్మికులు, కమీషన్ ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు నాణ్యమైన పంట ఉత్పత్తులు తీసుకువచ్చి గిట్టుబాటు ధర పొందేలా అవగాహన కల్పించాలన్నారు. మార్కెట్ యార్డులో పీఓఎస్ మిషన్లు, పారిశుద్ధ్యం, తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమావేశంలో మార్కెటింగ్‌శాఖ జేడీఎం శ్రీనివాస్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు. అలాగే తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం, జిల్లా అధికారుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో కలెక్టర్ డాక్టర్ సత్యశారద పాల్గొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

మత్తు పదార్థాల నియంత్రణకు చర్యలు
జిల్లాలో మత్తు పదార్థాలు, మారకద్రవ్యాల నిరోధకాన్ని సమష్టిగా కృషిచేసి యువత, విద్యార్థుల భవిష్యత్‌ను కాపాడాలని కలెక్టర్ సత్యశారద పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌హాల్‌లో మత్తు పదార్థాల నియంత్రణపై డీసీపీ రవీందర్‌తో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. విద్యాసంస్థల సమీపంలో కిరాణషాపులు, పాన్‌షాపులు వేదికగా గంజాయి, ఇతర మత్తు పదార్థాల విక్రయిస్తున్న ప్రాంతాల్లో నిఘా పెంచి తరచూ పెట్రోలింగ్ చేయాలని సూచించారు. విద్యార్థుల ప్రవర్తనను ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారి(ఇంచార్జ్) మాధవ రావును ఆదేశించారు. అనంతరం మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించే పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వరంగల్, నర్సంపేట ఆర్డీఓలు సత్యాపాల్‌రెడ్డి,ఉమారాణి, డీసీపీ ఈస్ట్‌జోన్ రవీందర్, ఏసీపీలు తిరుపతి, సైదులు, కిరణ్‌కుమార్, డీఎంహెచ్‌ఓ సాంబశివరావు,అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగం పేరిట మోసం

- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఉద్యోగం ఇప్పిస్తామంటూ వంచన
- అధిక మొత్తంలో డబ్బులు వసూలు
- నకిలీ అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఇచ్చిన వైనం
- లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు



పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వచ్చిన బాధితురాలు

నర్సంపేట:
'హాయ్ సార్ బాగున్నారా.. మేడం డిగ్రీ అయిపోయిందా.. ఆ కంప్లీట్ అయింది. ఉద్యోగం కోసం సెర్చ్ చేస్తున్నాం. ఓ అవునా.. కొన్ని డబ్బులు పెట్టుకుంటే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఉద్యోగం ఇప్పిస్తాం. శిక్షణ కూడా ఇచ్చి ఉద్యోగంలో చేరేలా నేను చూసుకుంటా. అయితే ఓకే ఎంత డబ్బులు ఇవ్వాలి. రూ.2.50 లక్షలు ఇవ్వండి. సరే ఇస్తాం'.

..ఇలా బ్రోకర్ ఓ వ్యక్తి నుంచి డబ్బులు వసూలు చేసి నకిలీ అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఇచ్చి మోసం చేసిన ఘటన నర్సంపేటలో వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి.. బుడిగొండ శృతి,రమేష్ దంపతులు నర్సంపేట పట్టణంలోని ఎన్టీఆర్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. రమేశ్ ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ క్రమంలో శృతి బీకాం కంప్యూటర్స్ విద్యనభ్యసించి ఉద్యోగం కోసం ప్రయత్నాలు మొదలుపెట్టింది. వారి ఇంటి సమీపంలోనే ఉంటున్న వావిళ్ల ప్రసాద్ ఆమె అవసరాన్ని ఆసరాగా చేసుకొని మాయమాటలు చెప్పి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికాడు.

నకిలీ శిక్షణ..అపాయింట్‌మెంట్..
సదరు బ్రోకర్ చెప్పిన విధంగా శృతి, రమేశ్ దంపతులు రూ.2.50లక్షలు ఇచ్చారు. ఈ క్రమంలో స్థానిక ఎస్‌బీఐ సమీపంలో వరంగల్‌కు చెందిన ఓ బ్రోకర్ ద్వారా శిక్షణ సైతం ఇప్పించారు. అనంతరం 2023 అక్టోబర్ 28వ తేదీన అపాయింట్‌మెంట్ ఆర్డర్ కాపీ శృతికి ఇచ్చి ఉద్యోగంలో జాయిన్ కావాలని చెప్పారు. దీంతో ఉద్యోగంలో జాయిన్ అవుదామని రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లగా.. ఇది నకిలీ అపాయింట్‌మెంట్ ఆర్డర్ అని, నిన్ను మోసం చేశారని అక్కడి సిబ్బంది తెలిపారు. దీంతో శృతి సదరు బ్రోకర్‌ను నిలదీయగా సంవత్సరం నుంచి తప్పించుకుని తిరుగుతున్నాడు. ఇటీవల శృతి పోలీసులను ఆశ్రయించి తనకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేసింది. మోసం చేసిన బ్రోకర్‌తో పాటు అతడికి సహకరిస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని వేడుకుంది. కాగా ప్రతీరోజు ఎక్కడో ఒక చోట ఇలాంటి మోసాలు జరుగుతున్నప్పటికీ నిరుద్యోగుల్లో చైతన్యం రావడం లేదు. కనీస అవగాహన లేకుండా ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికే వారికి డబ్బులు ఇస్తూ మోసపోతున్నారు. కాగా బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ కిరణ్‌కుమార్ తెలిపారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

- ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

నర్సంపేట: కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. ఈ మేరకు నర్సంపేట పట్టణం 13వ వార్డుకు చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సోమవారం ఎమ్మెల్యే మాధవరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే మాధవరెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాధవరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నియోజకవర్గ ప్రజలకు అందజేయడమే లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్, పట్టణ అధ్యక్షుడు బత్తిని రాజేందర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్యగౌడ్, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు ఒర్సు తిరుపతి, మండల అధ్యక్షుడు భానోతు లక్ష్మణ్‌నాయక్, కౌన్సిలర్లు ఎలకంటి విజయ్‌కుమార్, ములుకల వినోదసాంబయ్య, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మలపల్లి సందీప్, పట్టణ కాంగ్రెస్ ప్రచార కార్యదర్శులు బిట్ల మనోహర్, జన్ను మురళి, కార్యదర్శి నాంపల్లి వెంకటేశ్వర్లు గౌడ్, శ్రీరామోజు సౌందర్య, కొల్లూరి రాజు, కోమండ్ల గణేష్, పవన్, పెద్దరాజు పాల్గొన్నారు.

శోభాయమానం.. అనఘాష్టమి వ్రతం



పూజకు సిద్ధం చేసిన అనఘాష్టమి వ్రత కళశాలు

హన్మకొండ కల్చరల్: వరంగల్ ములుగు రోడ్డులోని దత్తక్షేత్రంలో సోమవారం అనఘాష్టమి వ్రతాన్ని శోభాయమానంగా నిర్వహించారు. దత్త ప్రచారక్ కొక్కుల రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజల్లో వేలాది మంది భక్తులు పాల్గొని సామూహికంగా వ్రతం ఆచరించారు. ఈసందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. ప్రతీ సంవత్సరం దత్తక్షేత్రంలో అనఘాష్టమి వ్రతం నిర్వహిస్తున్నట్లు, వేలాది మంది భక్తులు పాల్గొంటున్నట్లు తెలిపారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాల వితరణ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు వైవీ వామన్‌రావు, లక్ష్మీనారాయణ, కృష్ణప్రసాద్, అర్జున్‌రావు తదితరులు పాల్గొన్నారు.

● బ్లాక్‌బెర్రీ.. ముస్తాబు



ములుగు జిల్లా తాడ్వాయి – ప్రసా మధ్యలో ఉన్న ఏటూరునాగారం అభయారణ్యంలోని జలగలంచ వాగు సమీపంలోని బ్లాక్ బెర్రీ దీవిని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతున్నారు. ఎకోటూరిజంలో భాగంగా ఐదు ఎకరాల విస్తీర్ణంలోని ఇసుక తిన్నెపై ఆధునిక గుడారాలు సిద్ధమయ్యాయి. రెస్టారెంట్, క్యాంప్‌ఫైర్, ఇసుకలో ఆటలు ఆడుకునేలా సిద్ధం చేస్తున్నారు. సోమవారం రాత్రి విద్యుత్ వెలుగుల్లో దీవి కాంతులీనింది. – ఎస్ఎస్‌తాడ్వాయి

- వివరాలు 8లో ▸

విధుల్లో చేరకుండానే అనంతలోకాలకు..

శిక్షణలో ఉన్న కానిస్టేబుల్ కేన్సర్‌తో మృతి

నెక్కొండ : శిక్షణలో ఉన్న కానిస్టేబుల్ మరికొద్ది రోజుల్లో విధులు చేరాల్సి ఉండగా.. విధి వక్రించి అనంతలోకాలకు చేరుకున్న ఘటన మండలంలోని అలంకానిపేటలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలిలా.. గ్రామానికి చెందిన చీకటి యాకలక్ష్మి–ఉపేందర్ దంపతుల కుమారుడు రాకేశ్ (24) వరంగల్ కమిషనరేట్ పరిధిలో టీఎస్ఎస్‌పీ (తెలంగాణ స్టేట్ స్పెషల్ పోలీస్) కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికై హైదరాబాద్ ఇబ్రహీంపట్నంలోని కళాశాలలో 10 నెలలుగా శిక్షణ పొందుతున్నాడు. ఈనెల 27న పాసింగ్ ఔట్ పరేడ్ జరిగి రాకేశ్ విధుల్లో చేరాల్సి ఉంది. ఇదిలా ఉండగా శిక్షణలో రాకేశ్ అనారోగ్యం బారినపడగా హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారు. వైద్యులు పరీక్షించి రాకేశ్ బ్లడ్ కేన్సర్ బారిన పడినట్టు నిర్ధారించారు. 15 రోజులుగా అత్యవసర వైద్యసేవలు అందిస్తున్నపటికీ ఆరోగ్యం విషమించడంతో ఉదయం మృతి చెందాడు. రాకేశ్ మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.



రాకేశ్ (ఫైల్)

క్లుప్తంగా

రైల్వే ఇంజనీరింగ్ బ్లాక్‌తో పలు రైళ్ల రద్దు

రేపటి నుంచి జనవరి 9వ తేదీ వరకు..

కాజీపేట రూరల్ : వరంగల్-విజయవాడ మధ్య మోటమర్రి సెక్షన్‌లో మూడో రైల్వే లైన్, ఇంజనీరింగ్ బ్లాక్‌తో ఈ నెల 25వ తేదీ (రేపటి) నుంచి 2025 జనవరి 9వ తేదీ వరకు కాజీపేట, వరంగల్ రైల్వే స్టేషన్ల మీదుగా ప్రయాణించే పలు రైళ్లను రద్దు చేసినట్లు కాజీపేట రైల్వే అధికారులు సోమవారం తెలిపారు.

రద్దయిన రైళ్ల వివరాలు..

ఈ నెల 25వ తేదీ నుంచి జనవరి 9వ తేదీ వరకు కాజీపేట-డోర్నకల్ (07753) ప్యాసింజర్, డోర్నకల్-కాజీపేట (07754) ప్యాసింజర్, డోర్నకల్-విజయవాడ (07755) ప్యాసింజర్, విజయవాడ-డోర్నకల్ (07756) ప్యాసింజర్, విజయవాడ-భద్రాచలంరోడ్ (07979) ప్యాసింజర్,భద్రాచలంరోడ్-విజయవాడ (07278) ప్యాసింజర్ రైళ్లు రద్దయ్యాయి.

28వ తేదీ నుంచి మరికొన్ని రైళ్లు..

ఈ నెల 28 నుంచి జనవరి 9వ తేదీ వరకు గుంటూరు-సికింద్రాబాద్ (12705) ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్-గుంటూరు (12706) ఎక్స్‌ప్రెస్, విజయవాడ-సికింద్రాబాద్ (12713) ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్-విజయవాడ (12714) రైళ్లు రద్దయ్యాయి. ఇవే కాకుండా కాజీపేట, వరంగల్ రైల్వే స్టేషన్ మీదుగా ప్రయాణించే మొత్తం 28 రైళ్లు రద్దు, 23 రైళ్లు దారిమళ్లింపు, 3 రైళ్లు రీషెడ్యూల్, కాజీపేట, వరంగల్‌లో 14 రైళ్లకు తాత్కాలిక హాల్టింగ్ ఎత్తివేత, 2 రైళ్లను పార్శిల్లీ రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

వరంగల్ మార్కెట్‌కు రెండు రోజులు సెలవు

వరంగల్: క్రిస్మస్ సందర్భంగా వరంగల్ వ్యవసాయ మార్కెట్‌కు రెండు రోజులు సెలవు ఉందని, ఈ సమయంలో ఎలాంటి క్రయ, విక్రయాలు జరగవని మార్కెట్ కార్యదర్శి పి.నిర్మల సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 25వ తేదీ క్రిస్మస్, 26వ తేదీ బాక్సింగ్ డే ఉన్న నేపథ్యంలో మార్కెట్ బంద్ ఉంటుందన్నారు. ఈవిషయాన్ని రైతులు, వ్యాపారులు గమనించి తమ పంట ఉత్పత్తులను మార్కెట్‌కు తీసుకురావొద్దని తెలిపారు.


పీహెచ్‌డీ అడ్మిషన్లు కల్పించాలి



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో తమకు పీహెచ్‌డీలో అడ్మిషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ ముగ్గురు అభ్యర్థులు మంద నరేశ్, ఎస్.అనిల్, మాలోత్ తిరుపతి నాయక్ సోమవారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మల్లారెడ్డితో వాగ్వాదానికి దిగారు. పీహెచ్‌డీ అడ్మిషన్ల ప్రక్రియ ఇప్పటికే పూర్తయిందని, ప్రస్తుతం అడ్మిషన్ల ప్రక్రియ తమ పరిధిలో లేదని మల్లారెడ్డి పేర్కొన్నారు. అనంతరం ముగ్గురు అభ్యర్థులు వీసీ చాంబర్‌లో ఆమరణ దీక్షకు దిగారు. వీసీ ప్రతాప్‌రెడ్డి ఆ అభ్యర్థులతో మాట్లాడారు. ఇప్పుడు పీహెచ్‌డీ అడ్మిషన్లు కల్పించడం తన చేతిలోలేదన్నారు. ఉన్నత విద్యాశాఖ నుంచి అనుమతి తెచ్చుకుంటేనే అవకాశం ఉంటుందన్నారు. అయితే తమకు అడ్మిషన్లు కల్పించాల్సిందేనని పట్టుబడుతూ నిరసన తెలిపారు. దీంతో కేయూ సీఐ రవికుమార్, ఎస్సై రవీందర్ ఘటనాస్థలికి చేరుకుని అభ్యర్థులను బయటకు తీసుకొచ్చి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం విడుదల చేశారు.



విద్యుత్ దీపాల వెలుగుల్లో దీవి



పర్యాటకులు కూర్చునేందుకు మంచె

బ్లాక్‌బెర్రీ ముస్తాబు..

తాడ్వాయి అడవుల్లో టూరిజం స్పాట్

- మరికొద్ది రోజుల్లోకి అందుబాటులోకి..
- ఆధునిక గుడారాలు ఏర్పాటు..
- ఇసుక మేటల మీద క్యాంప్‌ఫైర్
- బీచ్ వాలీబాల్ తరహా ఆటలకు అవకాశం



ఫారెస్ట్‌లోని బ్లాక్‌బెర్రీ దీవిలో ఇసుక తిన్నెపై ఏర్పాటు చేసిన పర్యాటక గుడారాలు

ఎస్ఎస్‌తాడ్వాయి: చుట్టు ఎత్తైన కొండలు.. కొండల మధ్య నది.. నదిపై పడవలో ప్రయాణం. ఈ అనుభూతి మాటల్లో వర్ణించలేం. బోటులో ప్రయాణిస్తూ కనుచూపు మేర ఉన్న ప్రకృతి అందాలకు పర్యాటకులు ఫిదా కావాల్సిందే. ఇలాంటి సుందర దృశ్యానికి కేరాఫ్ పాపికొండలు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రెండు తెలుగు రాష్ట్రాల్లో పర్యాటకులకు ఈ పర్యటన ఎంతో ప్రసిద్ధి. ఎత్తైన పాపికొండలపై పరుచుకున్న దట్టమైన అడవిలో గోదావరి నది ఇసుక తిన్నెల్లో బస చేసే కొల్లూరు హట్స్ ఎంతో ప్రసిద్ధి. అయితే కచ్చలూరు ఘటన తర్వాత ఈ హట్స్‌ను తీసేశారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు పర్యాటకులకు ఆ లోటును తాడ్వాయి అడవుల్లోని బ్లాక్‌బెర్రీ ఫారెస్ట్ భర్తీ చేస్తోంది. తాడ్వాయి – పస్రా మధ్యలో ఉన్న ఏటూరునాగారం అభయారణ్యంలో జలగలంచ వాగు సమీపంలో ఎకోటూరిజంలో భాగంగా అధికారులు గుడారాలను అభివృద్ధి చేశారు. ఇసుక మధ్యలో 50 ఆధునిక గుడారాలు సిద్ధమయ్యాయి. వాగులోని ఇసుక మేటల మీద క్యాంప్‌ఫైర్ అనుభూతిని పొందొచ్చు. బీచ్ వాలీబాల్ తరహా ఆటలకు అవకాశం కల్పించారు. పర్యాటకులు ప్రకృతిలో సేదదీరేలా అన్ని హంగులు రెడీ అవుతున్నాయి. మరికొద్ది రోజుల్లో అందుబాటులోకి రానుంది. రామప్ప, లక్నవరం, మేడారం, బొగతా, మల్లూరు వెళ్లే పర్యాటకులు ఇక్కడ ఒక రోజు విడిది చేసి పచ్చని ప్రకృతిలో చక్కని అనుభూతులు సొంతం చేసుకోవచ్చు.

పర్యాటక ప్రాంతంగా బ్లాక్ బెర్రీ దీవి..



బ్లాక్ బెర్రీ దీవిలో చలిమంటలు కాగుతున్న మంత్రి సీతక్క

అటవీ ప్రాంతంలోని బ్లాక్ బెర్రీ దీవిని పర్యాటకంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. ఈ మేరకు సోమవారం రాత్రి బ్లాక్ బెర్రీ దీవిని మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, కలెక్టర్ దివాకర్ టీఎస్‌తో కలిసి సందర్శించారు. పర్యాటకుల కోసం ఏర్పాటు చేస్తున్న గుడారాలు, క్యాంప్‌ఫైర్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ చిత్ర మిశ్రా, డీఎఫ్‌ఓ రాహుల్ కిషన్ జాదవ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవీందర్, తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాటు చేసిన రెస్టారెంట్



స్వాగతద్వారం వద్ద విద్యుత్ వెలుగులు



విద్యుత్ వెలుగుల్లో పర్యాటక గుడారాలు

స్మగ్లర్‌ను హీరో చేశారు.. పోలీసులను విలన్ చేశారు..

- మంత్రి డాక్టర్ ధనసరి సీతక్క

ములుగు: ఒక స్మగ్లర్ పోలీసును బట్టలు విప్పి నిలబెడితే జాతీయ అవార్డులు ఇవ్వడం దేనికి సంకేతం.. స్మగ్లర్‌ను హీరో చేశారు.. పోలీసులను విలన్ చేశారని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి సీతక్క అన్నారు. ములుగులో సోమవారం జరిగిన క్రిస్మస్ వేడుకల సందర్భంగా ఆమె మాట్లాడారు. సినిమా హాల్‌లో జరిగిన తొక్కిసలాటలో మహిళ మృతి చెందిన ఘటనను ఆసరాగా తీసుకొని బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు సెంటిమెంట్‌ను వాడుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. రాజకీయ ప్రయోజనం కోసం బీఆర్ఎస్ ముసుగులో సినీ హీరో అల్లు అర్జున్ ఇంటిపై రాళ్లు రువ్వి కొంత మంది రాద్ధాంతం చేయజూస్తున్నారని మండిపడ్డారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరఫున అండగా ఉంటామని, అల్లు అర్జున్‌పై తమకు ఎలాంటి కోపం లేదన్నారు. లంగతనాలు, దొంగతనాలపై తీసే సినిమాలపై ఎవరూ సానుకూలంగా స్పందించరని, తెలుగు సినీ ఇండస్ట్రీ ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని చూడడం లేదని తెలిపారు.

రేవంత్ పాలనలో ఓరుగల్లుకు ఒరిగిందేమీ లేదు



మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, పక్కన మాజీ ఎంపీ వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు దయాకర్‌రావు, వినయ్‌భాస్కర్, సుదర్శన్ రెడ్డి, నరేందర్, శంకర్‌నాయక్

- సూపర్ ఆస్పత్రి నిర్మాణంలో నిర్లక్ష్యం సరికాదు
- 14 నెలల్లో ఒక్క శాతం పని కూడా పూర్తి కాలేదు
- మాజీ మంత్రి హరీశ్‌రావు



ఆస్పత్రి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

ఎంజీఎం : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంవత్సర పాలన కాలంలో ఓరుగల్లు ఒరింగిదేమీ లేదని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. కేసీఆర్ మొదలుపెట్టిన సూపర్ ఆస్పత్రి ప్రారంభిస్తే మంచి పేరు వస్తుందనే భావనతో 14 నెలల కాలంలో ఒక్క శాతం పనులు కూడా పూర్తి చేయలేదని విమర్శించారు. సోమవారం సెంట్రల్ జైలు ప్రాంగణంలోని సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులను మాజీ ఎంపీ వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులు పూర్తయితే ఒకేసారి 150 మందికి ఐసీయూ చికిత్సలు అందుతాయన్నారు. ఉత్తర తెలంగాణ జిల్లాలకు ప్రజలకు అవయవ మార్పిడి శస్త్రచికిత్సలు జరిగేలా 33 ఆపరేషన్ థియేటర్లు అందుబాటులోకి వస్తాయన్నారు. 2023 అక్టోబర్‌లో పనులు సందర్శించినప్పుడు ఏ విధంగా ఉందో ప్రస్తుతం ఆ విధంగానే ఉందని తెలిపారు. అప్పటికే 84 శాతం ఆస్పత్రి పనులు పూర్తయినట్లు పేర్కొన్నారు. మొదట్లో ఆస్పత్రి నిర్మాణ పనులను 1,750 పడకలు, 16 లక్షల ఎస్ఎఫ్‌టీ(స్క్వేర్ ఫీట్) అనుకున్నా తరువాత కేసీఆర్ నిర్ణయం మేరకు 2,000 పడకలు, 20.50 లక్షల ఎస్ఎఫ్‌టీ మార్చినట్లు పేర్కొన్నారు. అలాగే, ఎంజీఎం నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందన్నారు. ఈ దుస్థితిపై రోజూ వివిధ పత్రికల్లో కథనలు వెలువడుతున్నాయన్నారు. అయినా ప్రభుత్వం ఆ సమస్యలను పట్టించుకోదు..సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణాన్ని పూర్తి చేయదని విమర్శించారు.

ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారు..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని పథకాలను బంద్ చేశారని హరీశ్‌రావు పేర్కొన్నారు. దళిత బంధు, చేప పిల్లల పంపిణీ, కేసీఆర్ కిట్, న్యూట్రీషియన్ కిట్టు, రైతుబంధు.. ఇలా బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన అన్ని పథకాలు బంద్ చేసి కాంగ్రెస్ దద్దమ్మ పాలన సాగిస్తుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అసమర్థతను ప్రశ్నిస్తే బీఆర్ఎస్ నాయకులపై విచారణ, కమిషన్ పేరుతో కేసులు పెడుతూ దుర్మార్గపు పాలన సాగిస్తున్నానరని మండిపడ్డారు. కాంగ్రెస్‌లో ఎంతో మంది సీనియర్లు ఉన్నా ఎన్నో పార్టీలు మారిన రేవంత్‌రెడ్డి అందరిని అణగదొక్కుతూ సీఎం కుర్చీలో కూర్చున్నారని విమర్శించారు. రాజస్తాన్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన 24 అంతస్తుల నిర్మాణ పనులను ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం యథావిధిగా చేపడుతుందనే విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు దయాకర్‌రావు, వినయ్ భాస్కర్, నరేందర్, సుదర్శన్‌రెడ్డి, శంకర్‌నాయక్, నాయకులు దాచేపల్లి సీతారాం, దిడ్డి కుమారస్వామి, రమేశ్‌బాబు, ఎండి. షఫీ తదితరులు పాల్గొన్నారు.

వంశీ మృతదేహాన్ని తెప్పించే ప్రయత్నం చేస్తా

- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్



వంశీ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న బీజేపీ నాయకులు

కమలాపూర్: అమెరికాలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన వంశీ మృతదేహాన్ని వీలైనంత త్వరగా స్వగ్రామానికి తెప్పించే ప్రయత్నం చేస్తానని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ హామీ ఇచ్చారు. ఈ మేరకు కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సుబ్రహ్మణ్యం జయశంకర్‌కు లేఖ రాశారు. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం మాదన్నపేటకు చెందిన బండి వంశీ ఉన్నత చదువు కోసం 2022 ఆగస్టులో అమెరికాకు వెళ్లి గత శనివారం అక్కడే అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా, వంశీ కుటుంబాన్ని బీజేపీ మండల నాయకులు సోమవారం పరామర్శించి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను ఫోన్‌లో సంప్రదించి వంశీ కుటుంబ సభ్యులతో మాట్లాడించారు. బీజేపీ మండల అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి శోభన్‌బాబు, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వర్, మైనార్టీ మోర్చా మండల అధ్యక్షుడు రాజ్‌మహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుకు తప్పిన పెనుప్రమాదం

- నిర్మాణంలో ఉన్న అండర్‌పాస్ బ్రిడ్జికి ఢీ..
- పలువురు ప్రయాణికులకు స్వల్ప గాయాలు
- యాదగిరిగుట్ట మండలం వంగపల్లి వద్ద ఘటన



అండర్‌పాస్ బ్రిడ్జి పైకి దూసుకెళ్లిన బస్సు

యాదగిరిగుట్ట రూరల్: హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం వంగపల్లి గ్రామం వద్ద నిర్మాణంలో ఉన్న అండర్‌పాస్ బ్రిడ్జి పైకి ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు దూసుకెళ్లి ఆగిపోయింది. ఈ ప్రమాదంలో పలువురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్-2 డిపోనకు చెందిన ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు సోమవారం ఉదయం హైదరాబాద్ నుంచి హనుమకొండకు 33 మంది ప్రయాణికులతో బయలుదేరింది. మార్గమధ్యలో యాదగిరిగుట్ట మండలం వంగపల్లి గ్రామం వద్దకు రాగానే అండర్‌పాస్ బ్రిడ్జి పైకి అదుపుతప్పి దూసుకెళ్లింది. ఇనుప చువ్వలను తాకి నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు ఒకరిమీద ఒకరు పడడంతో స్వల్ప గాయాలయ్యాయి. దీంతో 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు. ఈ ప్ర మాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. జాతీయ రహదా రిపై సరైన ఇండికేషన్ లేకపోవడంతోనే ప్రమాదం జరిగిందని ప్రయాణికులు ఆరోపించారు.

శాస్త్ర సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆయిల్‌పామ్ ప్రదర్శన



కిసాన్ మేళా, వ్యవసాయ ప్రదర్శనకు హాజరైన రైతులు

- భారత వ్యవసాయ పరిశోధన మండలి డైరెక్టర్ షేక్.ఎస్.మీరా
- మల్యాల కేవీకేలో ఘనంగా కిసాన్ మేళా, వ్యవసాయ ప్రదర్శన

మహబూబాబాద్ రూరల్ : రైతులు వ్యవసాయంలో యాంత్రీకరణ పాటిస్తూ శాస్త్ర సాంకేతిక రంగాల్లో అభివృద్ధి చెందడానికి కృషి చేయాలని భారత వ్యవసాయ పరిశోధన మండలి (హైదరాబాద్ అటారీ జోన్ 10) డైరెక్టర్ డాక్టర్ షేక్.ఎస్.మీరా అన్నారు. జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా సోమవారం మహబూబాబాద్ మండలంలోని మల్యాల కృషి విజ్ఞాన కేంద్రంలో కిసాన్ మేళా, వ్యవసాయ ప్రదర్శన ఘనంగా నిర్వహించారు. మొదట కేవీకేలో మట్టి పరీక్ష కేంద్రం, సమీకృత వ్యవసాయ పాఠశాల కేంద్రం, వర్మి కంపోస్టు ప్రదర్శనశాలను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మీరా మాట్లాడారు. ప్రస్తుతం వరి, పత్తి, మిరప, మొక్కజొన్నతో పాటు ఇటీవల ఆయిల్ పామ్ సాగుపై కూడా రైతులు దృష్టి కనబరుస్తున్నారని, ఇది శుభపరిణామమని పేర్కొన్నారు. రైతులకు శాస్త్ర సాంకేతిక రంగాల్లో అవసరమైన సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో పీజేటీఎస్ఏయూ విస్తరణ సంచాలకురాలు జమునారాణి, వరంగల్ ఆర్ఏఆర్ఎస్ సహ పరిశోధన సంచాలకుడు ఉమారెడ్డి, ప్రిన్సిపల్ సైంటిస్టులు వెంకన్న, వీరన్న, రాజన్న, మల్యాల కేవీకే సమన్వయకర్త ఎస్.మాలతి, శాస్త్రవేత్తలు కిశోర్ కుమార్, రాంబాబు, క్రాంతికుమార్, అభ్యుదయ రైతులు వల్లూరి కృష్ణారెడ్డి, గోపాల్ రెడ్డి, యాదగిరి, జిల్లా వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు విజయనిర్మల, మరియన్న, మల్యాల హెచ్ఆర్ఎస్ శాస్త్రవేత్త ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర గంజాయి ముఠా అరెస్ట్

- రూ. 40 లక్షల విలువైన గంజాయి పట్టివేత
- వివరాలు వెల్లడించిన భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే



భూపాలపల్లి: నిందితుల అరెస్ట్ చూపి వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ కిరణ్ ఖరే

భూపాలపల్లి: అంతర్రాష్ట్ర ముఠాను అరెస్ట్ చేసి భారీ స్థాయిలో గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు జయశంకర్ భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే తెలిపారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కొందరు వ్యక్తులు ఆంధ్రప్రదేశ్ నుంచి భూపాలపల్లి జిల్లాకు గంజాయి రవాణా చేస్తున్నట్లు సమాచారం అందింది. ఈ మేరకు గణపురం ఎస్సై అశోక్ ఠాణా పరిధిలోని రవినగర్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో అటువైపు వస్తున్న ఓ కారును ఆపి తనిఖీ చేయగా అందులో రూ. 40 లక్షల విలువైన 160 కిలోల గంజాయి లభ్యమైంది. దీంతో కారులో ఉన్న ఏపీలోని తూర్పు గోదావరి జిల్లాకు చెందిన తోట మాధవరావు, ఒడిశాకు చెందిన భీమ్‌ప్రసాద్, సోమరుటాత్రీ, విశాఖపట్టణానికి చెందిన మక్కువ మోసిన్‌ను అరెస్ట్ చేశారు. నిందితులు ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా దారకొండ గ్రామానికి చెందిన బాబురావు వద్ద గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి భూపాలపల్లిలో విక్రయించేందుకు వస్తున్నట్లు తెలిపారు. కాగా, నిందితులను పట్టుకోవడంలో సమర్థవంతంగా విధులు నిర్వర్తించిన భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, చిట్యాల సీఐ మల్లేశ్, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

డోర్నకల్: గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి అతడి వద్ద నుంచి ఏడు కిలోల సరుకును స్వాధీనం చేసుకున్నట్లు డోర్నకల్ ఎస్సై గడ్డం ఉమ సోమవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. రైల్వే స్టేషన్ ప్రాంతంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఓ వ్యక్తి బ్యాగుతో అనుమానాస్పదంగా తిరుగుతున్నాడు. దీంతో అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా గంజాయి లభించింది. సదరు వ్యక్తిని విచారించగా ఏపీలోని విశాఖపట్టణం జిల్లా జీకే వీధి మండలం దుప్పలవాడకు చెందిన కిముడు గోపిగా తేలింది. సులువుగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో గోపి తన స్నేహితుడు ప్రవీణ్‌కుమార్ సంప్రదించాడు. దీనికి అతను గంజాయి విక్రయాలు చేపట్టాలని పేర్కొని ఒడిశాలోని చిత్రకొండ ప్రాంతం నుంచి ఆరు ప్యాకెట్ల గంజాయి కొనుగోలు చేసి గోపికి అందించాడు. అనంతరం ఆ గంజాయిని గోపికి ఇచ్చి వరంగల్‌లోని ఓ వ్యక్తికి ఇస్తే డబ్బు ఇస్తాడని తెలపడంతో గోపి ఖమ్మం వరకు బస్సులో వచ్చాడు. అక్కడి నుంచి ఓ రైలులో వరంగల్ బయలుదేరాడు. ఈ క్రమంలో రైలులో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండడంతో డోర్నకల్‌లో దిగిన గోపి పోలీసులకు పట్టుబడ్డాడు. పట్టుబడిన గంజాయి విలువ రూ.1,75,000 ఉంటుంది. గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మరో నిందితుడు విశాఖ జిల్లాకు చెందిన ప్రవీణ్‌కుమార్ పరారీలో ఉన్నట్లు ఎస్సై ఉమ తెలిపారు.

ఆర్థిక సంస్కరణల పితామహుడు పీవీ



కేయూ క్యాంపస్: పీవీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ మల్లారెడ్డి తదితరులు

- కేయూ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి



హనుమకొండ బస్టాండ్ జంక్షన్‌లోని పీవీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ కావ్య, ఎమ్మెల్యేలు రాజేందర్‌రెడ్డి, నాగరాజు తదితరులు

కేయూ క్యాంపస్: ఆర్థిక సంస్కరణల పితామహుడు పీవీ నర్సింహారావు అని కాకతీయ యూనివర్సిటీ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి అన్నారు. యూనివర్సిటీలోని పీవీ నాలెడ్జిసెంటర్ డైరెక్టర్ జి. కృష్ణయ్య అధ్యక్షతన సోమవారం మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు 20వ వర్ధంతిని క్యాంపస్‌లోని పొలిటికల్ సైన్స్ విభాగ సెమినార్‌హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ క్లిష్ట సమయంలో దేశాన్ని ఆర్థిక గండం నుంచి గట్టెక్కించిన గొప్ప నేత పీవీ నర్సింహారావు అని కొనియాడారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ పి. మల్లారెడ్డి, పాలకమండలి సభ్యులు కె.అనితారెడి, ప్రొఫెసర్ బి. సురేశ్‌లాల్, డాక్టర్ చిర్ర రాజు, కేయూ దూరవిద్య కేంద్రం డైరెక్టర్ వి. రాంచంద్రం, కుర్టా అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎ. సదానందం, జనరల్‌సెక్రటరీ ప్రొఫెసర్ వడ్డె రవీందర్, ఆచార్యులు కె. సుధాకర్, పొలిటికల్ సైన్స్ విభాగం అధిపతి సంకినేని వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

పీవీకి ఘన నివాళి..

హన్మకొండ చౌరస్తా : హనుమకొండలోని డీసీసీ భవన్‌లో సోమవారం మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ నేతలు.. పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం హనుమకొండ బస్టాండ్ జంక్షన్‌లోని పీవీ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వరంగల్ ఎంపీ కావ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, పీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాసరావు, బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఈవీ శ్రీనివాసరావు, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బంక సరళ, కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు, నాయకులు బంక సంపత్, బొమ్మతి విక్రమ్, బిల్ల రమణారెడ్డి, మహ్మద్ అంకుశ్, కుమార్, సురేందర్, రమేశ్, సతీశ్, హరిసింగ్, తదితరులు పాల్గొన్నారు.